క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చందర్



కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: దేశ రాజధా ఢిల్లీలో గురువారం జరిగిన బీఆర్‌ఎస్ జాతీయ కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ బోనాల ఉత్సవాలు



మొక్కులు చెల్లిస్తున్న పుట్ట శైలజ

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి గ్రామంలో గురువారం పెద్దమ్మతల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇంటి నుంచి మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్లతో వెళ్లి పెద్దమ్మతల్లికి నైవేద్యం చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ హాజరై మొక్కులు చెల్లించారు.

శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న చైర్మన్ దంపతులు

ధర్మారం: మండలంలోని ఖిలానవపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామాచారి, గరిమెళ్ల విష్ణుస్వామి, గోపిస్వామి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఠాకూర్ హన్మాన్‌సింగ్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ సాగంటి తారకొండయ్య, ఎంపీటీసీ మెతె సుజాత పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ భద్రత, పొదుపు అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం సిబ్బంది ఆవిష్కరించారు. ఏఈ రాజేంద్రకుమార్, సిబ్బంది రవివర్మ, గణపతి, మధిన్, భూమయ్య, రవి, శివ, రాజయ్య పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఎమ్మెల్యే చేయూత

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని మార్కండేయ కాలనీకి చెందిన దున్నపోతుల శ్రీనివాస్ కుమార్తె వివాహానికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి రూ.5వేలు, 50కిలోల బియ్యం అందజేశారు. మాజీ ఎంపీటీసీ తిప్పారపు దయాకర్ ఉన్నారు.

బుద్ధ జయంతి ఉత్సవాలకు సిద్ధం

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ శివారులో ఉన్న ప్రాచీన బౌద్ధస్తూపం వద్ద బుద్ధ జయంతోత్సవాలను శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మొగురం రమేశ్ తెలిపారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ హాజరు కానున్నట్లు చెప్పారు.

క్షీరాభిషేకం



కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతుబీమా లాగే గీత కార్మికులకు రూ.5లక్షల బీమా ప్రకటించడాన్ని హర్షిస్తూ క్షీరాభిషేం చేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు బైరి అంజయ్యగౌడ్, సర్పంచ్ వెంకటేశ్, సదానందం, నాయకులు లక్ష్మణ్, సాయి, కల్యాణ్, శ్రీహరి, వేణు, నర్సయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

అధ్వానంగా దేవాలయం రోడ్డు

- రెండు కిలోమీటర్ల మేర గుంతలు ఏర్పడిన వైనం
- నిధులు ఉన్నప్పటికీ రోడ్డు నిర్మించని వైనం
- రాత్రిపూట భయంభయంగా ప్రయాణిస్తున్న వాహనదారులు



అధ్వానంగా ఉన్న ఆలయానికి వెళ్లే సీసీరోడ్డు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని నాగుల మల్లికార్జునస్వామి దేవాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రమాదకరంగా మారింది. గత పాలకుల హయాంలో వేసిన సీసీరోడ్డు ప్రస్తుతం రోడ్డు ధ్వంసమై వాహనాలు నడవలేని పరిస్థితి నెలకొంది. రైల్వే గేట్ నుంచి ఆలయం వరకు దాదాపు రెండు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. నాగుల మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

సైడ్ డ్రైనేజీ కాలువలు నిర్మించాలి

సైడ్ డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో వర్షం నీరు ఇళ్లలోకి వస్తున్నాయి. రోడ్డును వెడల్పు చేసి సైడ్ డ్రైనేజీ కాలువలను నిర్మించాలని గ్రామప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా న్యూమారేడుపాక గ్రామప్రజలు వివిధ పనులకు పోయి తిరిగి సాయంకాలం, రాత్రి సమయంలో రోడ్డుపై నడవాలంటేనే జంకుతున్నారు. నూతన పాలకవర్గం వచ్చి మూడేళ్లయినప్పటికీ నిధులు ఉండి సీసీరోడ్డు నిర్మించడం లేదు. దీంతో వర్షాల కారణంగా రోడ్డుపై గుంతలు, పగుళ్ల ఏర్పడడంతో రోడ్డుపై నడవలేకపోతున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును తిరిగి పునర్ నిర్మించాలని భక్తులు, గ్రామప్రజలు కోరుతున్నారు.

రూ.50లక్షల నిధులు విడుదలయ్యాయి

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50లక్షల నిధులు విడుదలయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టి రోడ్డును పునర్‌నిర్మిస్తాం.

– తాళ్ల అమృత, డివిజన్ కార్పొరేటర్

త్వరగా సీసీరోడ్డు నిర్మించాలి



గత పాలకులు వేసిన రోడ్డు మొత్తం పగుళ్లతో గుంతలు ఏర్పడడంతో రోడ్డుపై నడవలేకపోతున్నాం. త్వరగా సీసీరోడ్డును నిర్మించాలి.

– పిడుగు రాజలింగు, న్యూమారేడుపాక

ఇబ్బందిగా ఉంది



పగుళ్లతో ఉన్న సీసీరోడ్డుపై వాహనాలు నడపాలంటేనే భయం వేస్తోంది. అంతేకాకుండా రాత్రివేళల్లో రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది.

– తాళ్ల నాగరాజు, న్యూమారేడుపాక

అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు

- ధర్మారం ఎంపీపీ కరుణశ్రీ
- మన ఊరు–మన బడి పనుల్లో అధికారుల నిర్లక్ష్యంపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణశ్రీ

ధర్మారం: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా పూర్తిచేయాలని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ సూచించారు. ధర్మారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. మన ఊరు–మన బడి పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. దొంగతుర్తి ప్రభుత్వ హైస్కూల్‌లో చేపట్టిన పనులు సక్రమంగా జరగడం లేదని, ప్రహరీ శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉన్నప్పటికీ మరమ్మతు చేయడం లేదని ఎంపీటీసీ దాడి సదయ్య ఆరోపించారు. మేడారం హైస్కూల్‌లో చేపట్టిన బాత్‌రూం గోడల ఎత్తు తగ్గించి నిర్మిస్తున్నారని, నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తున్నారని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ సలామొద్దీన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఆర్‌అండ్‌బీ ఏఈఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని బంజేరుపల్లి, దొంగతుర్తి సర్పంచులు కల్లెం గంగారెడ్డి, ముత్యాల చంద్రశేఖర్ సభ దృష్టికి తీసుకొచ్చారు. బంజేరుపల్లి రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న పెద్ద వృక్షాలను తక్షణమే తొలగించాలని సర్పంచ్ గంగారెడ్డి కోరారు. దొంగతుర్తి బస్టాండ్‌లో రోడ్డును కబ్జా చేస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని దాడి సదయ్య ఆరోపించారు. పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లకు బీమా చెల్లింపు కోసం నిధులు కేటాయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి కోరారు. దొంగతుర్తిలో 30 మహిళా గ్రూప్‌లుండగా రుణాల మంజూరు సమయంలో వీవోలు మహిళా సభ్యుల నుంచి వసూలు చేస్తున్నారని ఎంపీటీసీ దాడి సదయ్య చెప్పారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, మరమ్మతు చేయడంలో ఎవరూ పట్టించుకోవడం లేదని సభ్యులు ఆరోపించారు. సదరస్ క్యాంపులో సర్టిఫొందిన దివ్యాంగులు ధర్మారం ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు వస్తే 50శాతం సబ్సిడీపై బస్‌పాసులు అందిస్తామని కంట్రోలర్ రాజునాయక్ తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మెడికల్ కాలేజ్‌లో ఫ్రెషర్స్ డే

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ తెలిపారు. ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తోపాటు కలెక్టర్ సంగీతసత్యనారాయణ, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, సింగరేణి డైరెక్టర్ ఎస్.బలరాం, డీఎంఈ రమేశ్‌రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లికి చెందిన కత్తుల చెన్నకేశవులు–మాధవి దంపతులు ఆరేళ్ల క్రితం గ్యాస్ సిలిండర్ పేలి మృతి చెందారు. అనాథలుగా మారిన హారిక, హరి భూషణ్‌లు నానమ్మ, తాతయ్య సమక్షంలో ఉంటున్నారు. ఇటీవల తాత అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ పోషణ భారంగా మారింది. స్పందించిన సీతారామ సేవా సమితి సభ్యురాలు బాధితులకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, 50కిలోల బియ్యం అందజేశారు. సేవాసమితి సభ్యులు పొన్నం రాజమణి, పెంచికల రమ్య యాదవ్, మేడగోని స్వప్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న నాయకులు

మంథని: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి పనిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు బెల్లంకొండ నర్సింగారావు అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో గురువారం సింగరేణి విశ్రాంత ఉన్నతాధికారితో కలిసి మాట్లాడారు. పుట్టిన గడ్డపై మమకారంతో ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వస్తున్నటు సింగరేణి విశ్రాంత ఉన్నతాధికారి కొమ్మిడి భూంరెడ్డి తెలిపారు. కమాన్‌పూర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు మల్యాల రాంచందర్, సామాజిక విశ్లేషకుడు పొన్నం రాంచందర్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నియంత్రివచ్చని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అన్నారు. బస్టాండ్ సమీపంలోని ఓ షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే అనుసరించాల్సిన పద్ధతులపై గురువారం అవగాహన కల్పించారు. సిబ్బంది మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్, మనోహర్ ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేస్తా

కమాన్‌పూర్: మంథని నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పటిష్టతకు కృషి చేస్తామని పార్టీ నాయకులు మాజీ డీఎస్పీ బెల్లంకొండ నర్సింగరావు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి భూంరెడ్డి అన్నారు. ఈ మేరకు కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంథనిలో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రంగౌడ్, పొన్నం రాంచంద్రం గౌడ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦హనుమాన్ మాలధారులకు భిక్ష

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల శ్రీశంభులింగేశ్వరస్వామి ఆలయంలో జిల్లా పరిషత్ మాజీ సభ్యులు గుర్రాల లావణ్య, మల్లేశం దంపతులు హనుమాన్ మాలధారులకు భిక్ష నిర్వహించారు. కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ రవి, లక్ష్మీనారాయణ, జూలూరి అశోక్‌కుమార్, పురం రమణ ఉన్నారు.

✦వైభవంగా హనుమత్సేవ

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో హనుమత్సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో హోమం, బలిహరణం, (శ్రీనృసింహ జయంతి), వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు రామాచార్యులు నిర్వహించారు.

✦156 మందికి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో నిర్వహిస్తున్న కంటివెలుగులో భాగంగా గురువారం 156 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 23 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, ఎంపీటీసీ నారగోని ఎల్లవ్వ, ఉపసర్పంచ్ చీకటి శైలజ, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

✦నేటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలో శ్రీనాగలింగేశ్వర స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నారు.

✦నిరుపేద యువతి వివాహానికి సాయం

ఓదెల: కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట్ గ్రామానికి చెందిన స్రవంతి, ఓదెల మండలం నాంసానిపల్లెకు చెందిన నేదూరి స్వామి వివాహం మల్లన్నసన్నిధిలో గురువారం జరిగింది. వధువు నిరుపేద కావడంతో కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ పట్టు చీర, రూ.5వేలు అందజేశారు. ఉపసర్పంచు వీరవేని రమేశ్, నాయకులు నూనె శ్రీనివాస్, రాజు, మహేశ్, శ్రీకాంత్ ,పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మడిపెల్లిలో హుస్సేన్‌మియా వాగు తీరంలో కాశీ మహాలింగేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. సర్పంచ్ అడిగొప్పుల రాణి, విగ్రహ దాతలు కల్వల పోషం, సొన్నాయిటెంకం ప్రవీణ్ కుమార్, తొడుపునూరి రాజేంద్రప్రసాద్ దంపతులు వధూవరుల తరపున కల్యాణోత్సవం జరిపించారు. అర్చక పురోహితులు బహ్మశ్రీసువర్ణ రాజేంద్రశర్మ, శ్రీధర్ శర్మ, బిట్టు కల్యాణం నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, ఏగోళపు కుమార్‌గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ సదయ్యగౌడ్, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ రానవేన రాజమల్లు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరానికి స్పందన



సూచనలు చేస్తున్న డాక్టర్ రాజమౌళి

సుల్తానాబాద్‌రూరల్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజమౌళి అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం డాక్టర్లకు సూచనలు ఇచ్చారు. సర్పంచ్ మోహన్‌రెడ్డి, డాక్టర్ ఫరహా, పీహెచ్ఎన్ సౌందర్య ఉన్నారు. అలాగే మండలంలోని కనుకులలో కంటివెలుగు కార్యక్రమాన్ని రైతుబంధు జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డితో కలిసి ఎంపీపీ బాలాజీరావు ప్రారంభించారు. సర్పంచ్ పోలు అంజయ్య, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజమల్లయ్య పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభం

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిబిరాన్ని గురువారం ఎంపీపీ ఆరెల్లి దేవక్క ప్రారంభించారు. జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, సర్పంచ్ గంట పద్మ, ఎంపీటీసీ కొట్టె సందీప్, ఎంపీవో భాస్కర్, ఉపసర్పంచ్ వేము కనుకయ్య, నాయకులు గంట వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

ఎల్కలపల్లిలో..

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఎంపీడీవో లత తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో కంటి పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ చిట్టబోయిన స్వరూప, ఎంపీవో షబ్బీర్, ఏపీఎం సదానందం, ఏఎన్ఎం వినోద పాల్గొన్నారు.

మంథనిలో అభివృద్ధి అంతంతే



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: మంథని నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధులు దేశ, రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవులు పొందినా.. మంథనిలో మాత్రం అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగిందని బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంథని విద్యార్థి యువత స్థాపించి 40ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకుడు కొండేల మారుతి ఆధ్వర్యంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సునీల్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతులకు నష్టం వాటిల్లుతోందని, వారికి సరైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ కోకన్వీనర్ నాంపల్లి రమేశ్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలువేరు సతీశ్, పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్, నాయకులు సబ్బని సంతోష్, బోయిని నారాయణ, పోతరవేణి క్రాంతికుమార్, కొండపాక సత్యప్రకాష్, బోగోజు శ్రీనివాస్ ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుర్తింపు సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లత

ఫెర్టిలైజర్‌సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్ 2022–23లో భాగంగా పాలకుర్తి మండలంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన ఎల్కలపల్లి గ్రామపంచాయతీని పాలకుర్తి ఎంపీడీవో లత తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ పాలకుర్తి మండలంలో ఐదు గ్రామ పంచాయతీలు వందశాతం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుర్తింపు సాధించాయి. జాతీయస్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రతినిధులు గ్రామంలోని స్వచ్ఛత, గ్రామంలో తడి, పొడి చెత్త సేకరించే విధానం, పారిశుధ్య నిర్వహణ, గ్రామపంచాయతీ పబ్లిక్ మరుగుదొడ్ల శుభ్రత పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టబోయిన స్వరూప రాజ్‌కుమార్, ఎంపీవో షబ్బీర్, ఏపీఎం సదానందం పాల్గొన్నారు.

ఉపాధిహామీ పెండింగ్ బిల్లులు చెల్లించండి



కూలీలతో మాట్లాడుతున్న గణేశ్

మంథని: పనులు చేసినా నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడడంతో ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ డిమాండ్ చేశారు. మంథని మండలం కాకర్లపల్లిలో గురువారం జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పేదవాడికి అందకుండా చేస్తుందన్నారు. పనిదినాలు 200కు పెంచి రోజుకు రూ.600 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మజీద్ కమిటీ అధ్యక్షుడిగా తాహేర్



ఎన్నికైన నూతన కార్యవర్గం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణ, ఈద్గా, అలంగీర్ మజీద్ కమిటీ అధ్యక్షుడిగా తాహేర్ (ఖాజాజాహిద్ మొహీనుద్దీన్)ను ఎన్నుకున్నారు. కాగా గురువారం ఈద్గా ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు. ఐదోసారి తాహేర్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఫారుక్, అక్బర్ ప్రధాన కార్యదర్శిగా ఎండీ రఫీక్, జాయింట్ సెక్రటరీగా ఫహేద్, కోశాధికారిగా సాదిక్ పాషా, కార్యనిర్వహణ కార్యదర్శిగా సంధాని, కార్యవర్గ సభ్యులుగా వహీద్, అన్ను, కరీం, ఖలీల్, సాజిత్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నదీమ్, ఫహీంను ఎన్నుకున్నారు.

నీటి ఆవశ్యకతపై ఉపన్యాస పోటీలు



మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్: నీటి ఆవశ్యకతపై గురువారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం జ్యోతినగర్‌లో మేడే వారోత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపన్యాస పోటీలను నిర్వహణ కమిటీ నాయకులు సంపత్, రామాచారి, లక్ష్మారెడ్డి ప్రారంభించారు. పోటీల్లో పలువురు పాల్గొని నీటి ఆవశ్యకతపై మాట్లాడారు. న్యాయ నిర్ణేతలుగా ఐత శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లితో నిరసన



కార్యదర్శులు వేసిన ముగ్గు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యల సాధనకోసం చేపట్టిన రిలే దీక్షలు గురువారం 7వ రోజుకు చేరాయి. పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద గురువారం పంచాయతీ మహిళా కార్యదర్శులు బంగారు తెలంగాణలో భాగంగా అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను పేర్కొంటూ వేసిన రంగవల్లులు పలువురిని ఆకట్టుకున్నాయి.